2500లూ ఇచ్చేసినం!

మహిళలకు ఇచ్చిన హామీ నెరవేర్చినం: ఇది రాహుల్ మాట

- గ్యారెంటీలపై కాంగ్రెస్ నయవంచన
- 5 గ్యారెంటీలు అమలైపోయాయన్న కాంగ్రెస్
- రైతుభరోసా చెల్లించామన్న సీఎం రేవంత్
- రాష్ట్రంలో కరెంట్ కోతలే లేవన్న ఉత్తమ్
- నిరుద్యోగ భృతి హామీయే ఇవ్వలేదన్న భట్టి

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): అబద్ధాలే ఊపిరిగా.. అబద్ధాలే జీవన విధానంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ అలవోకగా మరో అబద్ధం చెప్పేసింది! ఈసారి ఏకంగా ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నోటితోనే రాష్ట్ర నేతలు పచ్చి అబద్ధాలు వల్లె వేయించారు. రాష్ట్రంలోని 18 ఏండ్లు నిండిన మహిళలకు నెలకు రూ.2,500 జమ చేస్తున్నట్టు రాహుల్‌గాంధీతో చెప్పించి, యావత్ మహిళా లోకానికే షాకిచ్చారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పరంపరలో మరో అబద్ధం చేరిపోయింది. అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి రోజుకో అబద్ధం చెప్పడం, గ్యారెంటీల అమలుకు ముహూర్తాలు, డెడ్‌లైన్ ప్రకటించి చివరకు తుస్సు మనిపించడం కాంగ్రెస్ నేతలకు పరిపాటిగా మారిపోయింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయిన రైతుబంధుకు మరో రూ.ఐదు వేలు జోడించి అధికారంలోకి రాగానే రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ దానిని పూర్తి చేయలేదు. రైతుభరోసా కింద రూ.15 వేలు ఇవ్వకపోగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.పది వేలు కూడా ఇవ్వకుండా రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నది. అందరికీ రైతు బంధు జమ చేశామని ఒకసారి, ఇక నాలుగు లక్షల మందికే ఇవ్వాల్సి ఉన్నదని మరోసారి చెప్తూ కాలయాపన చేస్తున్నది. ఇంకోవైపు రైతు బంధు రాలేదన్న వారిని చెప్పుతో కొట్టండంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించి, రైతుల పట్ల తన చులకన భావాన్ని బహిరంగంగానే వ్యక్తంచేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రైతుబంధుపై గట్టిగా ప్రశ్నిస్తుండటంతో ఈ నెల 9లోగా అందరి ఖాతాల్లో జమ చేస్తామని మరో కొత్త డెడ్‌లైన్ పెట్టి ఊరిస్తున్నది. రైతు రుణమాఫీ విషయంలోనూ అదే ధోరణి. డిసెంబర్ 9 రుణమాఫీ చేస్తామని ప్రకటించుకున్న కాంగ్రెస్.. మే 9 వస్తున్నా మాట నిలుపుకోలేదు. మరోవైపు, వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని తాము చెప్పలేదని ఆ పార్టీ నేత రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రకటించడంతో రైతులు హతాశులయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రుణమాఫీ అంశం ఎజెండా మీదకు రావడం, బీఆర్‌ఎస్ నేతలు పదేపదే నిలదీస్తుండటంతో ఇప్పుడు పంద్రాగస్టు లోగా అంటూ మరో ముహూర్తం నిర్ణయించింది. రైతు రుణమాఫీని ఎలా చేస్తారు? ఎవరెవరికి వర్తింపజేస్తారు? విధివిధానాలేమిటి? అనే అంశాలపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేని అయోమయం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ ఊరి వెళ్తే ఆ ఊరి దేవుళ్లు, దేవతల మీద ఒట్టు మీద ఒట్టు పెడుతూ రైతులను నమ్మించేందుకు నానా తంటాలు పడుతున్నారు. రైతులు పండించిన పంటలకు రూ.500 బోనస్ హామీ బోగస్ ముచ్చటగా వెక్కిరిస్తున్నది. ఒకవైపు కరెంటు కష్టాలు చుట్టుముట్టి బోర్ల కాడ మోటర్లు కాలిపోతుంటే రాష్ట్రంలో విద్యుత్తు కోతలే లేవని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సెలవిస్తున్నారు. నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామంటూ ప్రియాంకాగాంధీ చేత యూత్ డిక్లరేషన్ ప్రకటింపజేసి అధికారంలోకి రాగానే మాట మార్చింది. అసలు తాము నిరుద్యోగ భృతి హామీయే ఇవ్వలేదంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరుద్యోగ యువతను వెక్కిరించారు. ఇలా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తూ, ఏ ఒక్క హామీ అమలు విషయంలోనూ ఏమాత్రం నిబద్ధత ప్రదర్శించిన కాంగ్రెస్ ఇప్పుడేమో ఐదు గ్యారెంటీలు, ఆరు గ్యారెంటీలు అమలు చేసేశామంటూ నయవంచనకు పాల్పడుతుండటం విస్మయం కలిగిస్తున్నది.

గ్యారెంటీలు అమలు చేశాం: రాహుల్‌గాంధీ

నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్: రాష్ట్రంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీల్లో ఇప్పటికే ఐదింటిని అమలు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండర్, పది లక్షల ఆరోగ్య బీమా, మహిళలకు రూ.2,500 ఇస్తున్నామని తెలిపారు. తాము కేంద్రంలో అధికారంలోకి రాగానే దేశంలోని పేదలందరినీ గుర్తించి ఆ ఇంట్లోని మహిళకు బ్యాంకు ద్వారా రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు, జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి చౌరస్తాలో నిర్వహించిన జనజాతర సభలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఆయా సభల్లో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. బీజేపీకి మళ్లీ అధికారం ఇస్తే రాజ్యాంగం ద్వారా భారత పౌరులకు కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు పూర్తిగా తొలగిస్తారని హెచ్చరించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చలన్నది బీజేపీ సిద్ధాంతమని, దానిని రక్షించాలన్నది కాంగ్రెస్ సిద్ధాంతమని దేశ ప్రజలు ఆలోచించి ఏ పార్టీ కావాలో నిర్ణయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న 50% రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసి, కులగణన ద్వారా అంత కంటే ఎక్కువ పెంచుతామని హామీ ఇచ్చారు. మోదీ పదేండ్ల పాలన అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని, దేశ సంపదను సామాన్యులకు అందివ్వకుండా సంపన్నులకు అందేటట్టు చూస్తున్నదని ఆరోపించారు. దేశంలో 130 కోట్ల జనాభా ఉంటే కేవలం 20% మంది వద్దనే సంపద పేరుకుపోయిందని, కాంగ్రెస్ పార్టీ విధానం అది కాదని చెప్పారు. దేశ సంపదను పేద ప్రజలందరికీ పంచాలన్న ఉద్దేశంతోనే పోరాడుతున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి వెనుకబడ్డ దళితులు, మైనార్టీలు, బీసీలు, ఆదివాసులకు న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని వివరించారు. దేశంలో మోదీ పాలనలో ఈ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు తాను చేపట్టిన భారత్ జోడో యాత్రకు విశేష స్పందన వచ్చిందని, ప్రజలు తమ సమస్యలను చెప్పుకున్నారని, వాటి పరిష్కారానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు.

ఇంద్రవెల్లి అమరుల సాక్షిగా చెప్తున్నా..

- రుణమాఫీపై రేవంత్ నేటి ఒట్టు

రైతు రుణమాఫీపై రోజుకో దేవుడిపై ఒట్టు పెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం నిర్మల్ జనజాతర సభలో మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి అమరవీరుల సాక్షిగా ఒట్టు పెట్టారు. ఎర్రవల్లి జనజాతరలో మాట్లాడుతూ.. జోగుళాంబ అమ్మవారి సాక్షిగా ఒట్టు పెట్టారు. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ, ఈ నెల 9 లోపు రైతు భరోసా అందజేస్తామని చెప్పారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఇక్కడికి వచ్చినప్పుడు ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటానని చెప్పానని, ఇప్పుడు కూడా అదే మాటకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలు చేశామని, రాబోయే రోజుల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని చెప్పారు. ఆయా సభల్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి, ఆదిలాబాద్ అభ్యర్థి ఆత్రం సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ ఉప్పల్ రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్‌లోని ముషీరాబాద్ రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

రాహుల్‌గాంధీవి పచ్చి అబద్ధాలు

- మహిళలకు 2,500 ఇచ్చామనడం హాస్యాస్పదం
- సింగరేణిని అదానీకి కట్టబెట్టేందుకు రేవంత్ యత్నాలు
- హైదరాబాద్‌కు మోదీ సర్కార్ చేసిందేమిటి?
- మల్కాజిగిరి, సికింద్రాబాద్ రోడ్డుషోలలో కేటీఆర్

హైదరాబాద్/సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి వచ్చిన రాహుల్‌గాంధీ నిర్మల్ సభలో పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.2,500, పింఛన్ రూ.4 వేలు ఇస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీ అమాయకుడు అని, ఇక్కడి కాంగ్రెస్ నేతలు రాసిచ్చింది చదివారని పేర్కొన్నారు. అసలు రేవంత్‌రెడ్డి ఎన్నికలు అయ్యాక కాంగ్రెస్‌లో ఉంటాడో, ఉండడో చూసుకోవాలంటూ రాహుల్‌గాంధీకి హితవు పలికారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, సికింద్రాబాద్ అభ్యర్థి టీ పద్మారావుగౌడ్‌కి మద్దతుగా ఆదివారం ఆయన ఎల్బీనగర్, ఉప్పల్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో రోడ్‌షో నిర్వహించారు. కర్మన్‌ఘాట్, ఉప్పల్‌క్రాస్‌రోడ్, ముషీరాబాద్, రాంనగర్ క్రాస్‌రోడ్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌ల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలను తక్కువ అంచనా వేసి రాహుల్‌గాంధీ అబద్ధాలు చెప్పారని విమర్శించారు. జనవరి నుంచి ఒక్కో మహిళకు రూ.10 వేలు, పింఛన్‌దారులకు రూ.16 వేలు, లక్షన్నర ఆడబిడ్డలకు లక్షన్నర తులాల బంగారం బాకీ ఉన్నారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ చౌకీదార్ చోర్ అంటే, రేవంత్ రెడ్డి మోదీ బడే భాయ్ అంటున్నాడని ఎద్దేవా చేశారు. అదానీకి సింగరేణి, ఇతర సంస్థలు కట్టబెట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు నెలల్లో ఒక్కటంటే ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచినందుకు ప్రధాని మోదీని ప్రజలు పిరమైన ప్రధాని అంటున్నారని ఎద్దేవా చేశారు. దేవుడిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దమ్ముంటే హైదరాబాద్‌కు బీజేపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ముక్కు పిండి రాష్ట్రాలకు వాటా దక్కకుండా సెస్ వేసి రూ.30 లక్షల కోట్లు వసూలు చేశారని మండిపడ్డారు. వీటిలో రూ.14 లక్షల కోట్లు అదానీ, అంబానీ లాంటి పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ చేశారని దుయ్యబట్టారు. తాను చెప్పింది అబద్ధమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఒక్క రూపాయి కూడా హైదరాబాద్‌కు ఖర్చు పెట్టలేదని విమర్శించారు. పదేండ్లలో ఎస్సార్డీపీ కింద బీఆర్‌ఎస్ ప్రభుత్వం 36 ప్రాజెక్టులు పూర్తి చేసిందని, కానీ మోదీ ప్రభుత్వం నారపల్లి, అంబర్‌పేట ఫ్లై ఓవర్లు కట్టలేకపోయిందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు సలీం, శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డీ.. చీర కట్టుకుంటావా?

'కేటీఆర్.. చీర కట్టుకుని బస్సెక్కి చూడు.. గ్యారెంటీలు అమలవుతున్నాయో.. లేదో' తెలుస్తుంది అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా అదే స్థాయిలో ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. 'రేవంత్‌రెడ్డీ.. చీర నువ్వు కట్టుకుంటావా? లేక రాహుల్‌గాంధీకి కట్టిస్తావా? మహిళలకు నెలకు రూ.2,500 ఎక్కడిస్తున్నారో చూపిస్తావా? ఇన్ని పచ్చి అబద్ధాలా? తెలంగాణాలో ఉన్న ఒక కోటీ 67 లక్షల మంది 18 ఏండ్లు నిండిన ఆడబిడ్డలు అడుగుతున్నారు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు. వంద రోజుల్లో అన్నీ చేస్తానని మాట తప్పినందుకు కాంగ్రెస్‌ను బొంద పెట్టేది తెలంగాణ ఆడబిడ్డలేనని హెచ్చరించారు. డైలాగులేమో ఇందిరమ్మ రాజ్యం, చేసేదేమో సోనియమ్మ జపం, మహిళా సంక్షేమంలో కాంగ్రెస్ సర్కారు పూర్తి వైఫల్యం అని దుయ్యబట్టారు. 'కేసీఆర్ కిట్ ఆగింది. న్యూట్రిషన్ కిట్ బంద్ అయింది. కల్యాణలక్ష్మి నిలిచింది. తులం బంగారం అడ్రస్ లేదు. ఫ్రీ బస్సు అని బిల్డప్. అందులో సీట్లు దొరకవు. అన్నింటినీ అటకెక్కించిన కాంగ్రెస్‌కు మహిళల ఓట్లడిగే హక్కు లేదు. చిల్లర మాటలు, ఉద్దెర పనులు తప్ప నువ్వు, నీ అసమర్థ ప్రభుత్వం చేసిందేమీ లేదు అని అందరికీ తెలిసిపోయింది' అని పేర్కొన్నారు. ఈ పోస్టుకు 'నెలకు ప్రతినెలా మహిళల అకౌంట్‌లో రూ.2,500 ఇస్తున్నాం' అని రాహుల్‌గాంధీ చెప్పిన వీడియోను ట్యాగ్ చేశారు. ఈ ట్వీట్‌కు నెటిజన్ల నుంచి అనూహ్యమైన స్పందన వస్తున్నది. గంటల వ్యవధిలోనే ఈ పోస్టుకు వేలాదిగా వ్యూస్, కామెంట్లు వస్తున్నాయి. 'అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి.. నేటివరకూ అబద్ధాలు చెప్తున్న రేవంత్‌రెడ్డి చీర కట్టుకోవాలి' అని నెటిజన్లు కామెంట్ చేశారు.

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన జానపద కళాకారుడు, పద్మశ్రీ మొగులయ్య

పద్మశ్రీ మొగులయ్యకు కేటీఆర్ సాయం

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రముఖ జానపద కళాకారుడు, పద్మశ్రీ కిన్నెరమెట్ల మొగులయ్యకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆర్థికసాయం అందించారు. బీఆర్‌ఎస్ సర్కారు అందించిన కళాకారుల పింఛన్‌ను కాంగ్రెస్ సర్కారు ఆపివేయడంతో ఆయన కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్న విషయం తెలుసుకున్న కేటీఆర్.. మొగులయ్యను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆదివారం మొగులయ్యను కలిసి ఆర్థికసాయం అందజేశారు. మొగులయ్యకు గత ప్రభుత్వం ఇచ్చిన కళాకారుల పింఛన్‌తోపాటు అన్నిరకాల హామీలను నెరవేర్చాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేటీఆర్ సాయానికి మొగులయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి మొగులయ్యను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేసీఆర్ రాకతో గెలుపు ఖాయం

- గోదావరిఖని, మంచిర్యాల రోడ్ షోలు గ్రాండ్ సక్సెస్
- సింగరేణి కార్మికులు ఆలోచించి ఓటు వేయాలి
- 'నమస్తే తెలంగాణ'తో బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల

గోదావరిఖని, మే 5: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరిఖని, మంచిర్యాలకు రావడంతో పెద్దపల్లిలో తన గెలుపు ఖాయమైందని బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ అధినేత నిర్వహించిన రోడ్ షోలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయని హర్షిస్తూ.. కేసీఆర్ తనపై చూపిన అభిమానాన్ని ఎన్నటికీ మరిచిపోలేనని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటానని తెలిపారు. ఉద్యమం నుంచి వెన్నంటి ఉన్న తనకు అనేక పదవులు ఇవ్వడంతోపాటు పెద్దపల్లి పార్లమెంట్ నుంచి అవకాశం కల్పించారని చెప్పారు. ఆగర్భ శ్రీమంతుడికి, భూగర్భ కార్మికుడికి మధ్య జరిగే పోటీలో సింగరేణి కార్మికులు ఆలోచన చేసి ఓటు వేయాలని సూచించారు. సింగరేణిని కాపాడుకోవాలన్నా.. కార్మికుల గళాన్ని వినిపించాలన్నా అన్ని వర్గాల ప్రజలు తనకు మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన గోదావరిఖనిలో 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. సింగరేణి ప్రాంతమన్నా.. కోల్‌బెల్ట్ ప్రజలన్నా కేసీఆర్‌కు ప్రాణమని, అందుకే ఈ ప్రాంతంపై ప్రత్యేక ప్రేమను చూపుతున్నారని గుర్తుచేశారు. సింగరేణి కార్మికులకు అనేక హక్కులు కల్పించారని, 19 వేల కొలువులు ఇప్పించి సింగరేణిలో యువ రక్తం నింపిన ఘనత కేసీఆర్‌దేనని ప్రశంసించారు. శుక్ర, శనివారాల్లో గోదావరిఖని, మంచిర్యాలలో రోడ్ షోలలో కేసీఆర్ పాల్గొని అందరిలోనూ భరోసా నింపారని చెప్పారు. ఎవరూ ఊహించని విధంగా ఈ రోడ్ షోలకు వేలాది మంది సింగరేణి కార్మికులు, అన్ని వర్గాల ప్రజల స్వచ్ఛందంగా వచ్చి బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటామని మద్దతు పలికారని కొప్పుల పేర్కొన్నారు.

యాచారం రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి. చిత్రంలో జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- క్యామ మల్లేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి
- జనగామ మాజీ ఎమ్మెల్యే, భువనగిరి ఎన్నికల ఇన్‌చార్జి ముత్తిరెడ్డి
- యాచారం, మంచాల మండలాల్లో బీఆర్‌ఎస్ రోడ్‌షో
- పాల్గొన్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం, మే 5: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజాసమస్యలను, ఇచ్చిన హామీలను విస్మరించిందని జనగామ మాజీ ఎమ్మెల్యే, భువనగిరి ఎంపీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. రంగారెడ్డి జిల్లా యాచారం, మంచాల మండలాల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. కేసీఆర్‌పై, బీఆర్‌ఎస్‌పై అసభ్యకరంగా మాట్లాడితే తమ పార్టీ కార్యకర్తలు తరిమికొట్టే రోజులొస్తాయని చెప్పారు. కొంత మంది పార్టీని వీడినంత మాత్రాన బీఆర్‌ఎస్‌కు ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు. త్వరలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. భువనగిరి ఎంపీగా తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని అభ్యర్థి క్యామ మల్లేశ్ హామీ ఇచ్చారు.

నాడు ఇల్లు లేదు.. నేడు కోట్లు ఎక్కడివి?

- రెండుసార్లు ఎంపీగా గెలిచి ప్రజలను పట్టించుకోని మల్లు రవి
- కొడుకుతో కంపెనీలు.. యువతకు మొండిచెయ్యి
- 'మల్లూ.. ఇక వెనక్కి మల్లు' అంటూ ఆర్‌ఎస్ ప్రవీణ్ ధ్వజం

పలు కంపెనీల్లో మల్లు రవి పెట్టుబడులు, హోదాలు

- రాహుల్ ఏజెన్సీస్, ట్రేడ్ వెల్ సెక్యూరిటీస్ లిమిటెడ్, కార్డామామ్ ఎస్టేట్స్ ఎల్‌ఎల్‌పీ కంపెనీలో భాగస్వామి (28 నవంబర్ 2017).
- ఎల్డోరా ఎస్టేట్స్ ఎల్‌ఎల్‌పీ కంపెనీలో భాగస్వామి(12 డిసెంబర్ 2019).
- ఆవిషా ఎస్టేట్స్ ఎల్‌ఎల్‌పీ కంపెనీలో భాగస్వామి(10 డిసెంబర్ 2019).
- రాహుల్ పెట్రో కెమికల్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ (23 సెప్టెంబర్ 2008).
- మల్లు ఇన్ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్ (3 జూన్ 2008).
- మెంటర్ టెక్నాలజీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్ (6 జూన్ 2016).
- త్రీడీఎస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్ (4 అక్టోబర్ 2012).
- వేవ్నాప్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్ (10 జూన్ 2019).
- కార్డామామ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్ (24 ఫిబ్రవరి 2005).

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని గతంలో రెండుసార్లు ఎంపీగా గెలిపిస్తే ప్రజలు, యువత కోసం ఏమీ చెయ్యలేదని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. మల్లు రవి మాత్రం కోట్లాది రూపాయలు సంపాదించుకున్నారని ధ్వజమెత్తారు. తన స్వార్థం కోసం అనేక కంపెనీలను స్థాపించుకున్న మల్లు రవి యువత కోసం ఒక్క కంపెనీ కూడా తీసుకురాలేదని ఆరోపించారు. అంతేగాక ఎంపీగా గెలవకముందు మల్లురవికి హైదరాబాద్‌లో సొంత ఇల్లు కూడా లేదని, కానీ ఇప్పుడు కోట్లాది రూపాయల విలువైన ఇల్లు, లగ్జరీ కార్లు, విలాసవంతమైన విల్లాలు, పలు కంపెనీలు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన సమర్పించిన వివరాల ఆధారంగానే తాను మాట్లాడుతున్నానని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కొడుకుతో అనేక కంపెనీలు పెట్టించి కోట్ల రూపాయలకు ఎగబాకిన మల్లు రవి నాగర్‌కర్నూల్‌ను ఎందుకు అభివృద్ధి చేయలేదని నిలదీశారు. మల్లు రవి కేవలం తన కుటుంబం కోసమే పాకులాడుతారని, ప్రజల సమస్యలు ఆయనకు పట్టవని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మళ్లీ ఇప్పుడు ఆయనను ఎంపీగా గెలిపిస్తే మరిన్ని కోట్ల రూపాయలు సంపాదించుకుంటారని, మరిన్ని కంపెనీలను స్థాపించుకుంటారని చెప్పారు. కాబట్టి 'మల్లూ.. ఇక వెనక్కి మల్లు' అనే నినాదంతో ముందుకుపోదామని, ప్రజలను పట్టించుకోని వ్యక్తికి తగిన బుద్ధి చెపుదామని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు.

రేవంత్.. నిన్ను చూస్తే ఊసరివెల్లీ సిగ్గుపడ్తది

- నీ రాజకీయం టీఆర్‌ఎస్‌తోనే మొదలైందన్నది గుర్తుంచుకో
- సీఎంపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మండిపాటు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, మే 5: 'నువ్వు.. ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉన్నావన్న విషయాన్ని మరువకు. నీ స్థాయికి తగిన మాటలు మాట్లాడు. ఇంతటి బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన సీఎంను నేను ఇంతవరకూ చూడలేదు. నిన్ను చూస్తే.. ఊసరవెల్లి కూడా సిగ్గుపడ్తది. నీ రాజకీయ జీవితం టీఆర్‌ఎస్‌తోనే మొదలైందన్న నిజాన్ని గుర్తుంచుకో' అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విరుచుకుపడ్డారు. ఆదివారం నిరంజన్‌రెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నోటికి ఎంత వస్తే అంత మాట్లాడటం, కేసీఆర్‌ను తిట్టడమే పరమావధిగా పెట్టుకోవడం తగదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రెండుసార్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్.. వయస్సులో నీ కంటే 20 ఏండ్లు పెద్ద అనే ఇంగిత జ్ఞానం లేకుండా ఆయనను తిట్టడం మంచిది కాదని హితవు చెప్పారు. రేవంత్ రాజకీయం నాటి టీఆర్‌ఎస్ పార్టీలోనే మొదలైందన్న విషయాన్ని మరువొద్దని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నాడు టీడీపీలో ఉన్న సమయంలో కాంగ్రెస్ నాయకురాలిపై ఎంత నీచంగా మాట్లాడావో ప్రజలకు గుర్తుందని, నేడు కాంగ్రెస్‌లో చేరి అదే సోనియమ్మను దేవత అంటూ, ఆమె రుణం తీర్చుకుంటామని బీరాలు పలుకుతున్న రేవంత్‌ను చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా గప్పాలు కొట్టడం తగదని హెచ్చరించారు. ఎప్పుడూ మహబూబ్‌నగర్ బిడ్డను అని చెప్పుకునే నువ్వు.. 90 శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డిని పూర్తి చేసి సాగునీరందించాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చేందుకు రూ.7,500 కోట్లు సిద్ధంగా ఉంచితే.. కాంగ్రెస్ సర్కారు వచ్చిన వెంటనే వాటిని రైతు ఖాతాల్లో జమచేయకుండా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించిందని విమర్శించారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి బైకని శ్రీనివాస్, బీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్, ఓవైసీ ఒక్కటేనని, అందుకే రామమందిర ప్రారంభోత్సవానికి రాహుల్ గాంధీ హాజరు కాలేదన్నారు. రిజర్వేషన్లు రద్దు అంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని, తన వీడియోను కూడా తప్పుగా వైరల్ చేసిందని చెప్పారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తామన్నారు. దేశంలో పీఎఫ్ఐ సంస్థ రూపులేఖలను కూడా లేకుండా చేసింది బీజేపీయేనని, ఓవైసీలాంటి వారు ఈ దేశంలో పీఎఫ్ఐ లాంటి సంస్థలను ప్రోత్సహిస్తే జాగ్రత్త అంటూ హెచ్చరించారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలను కాంగ్రెస్సే మూయించిందని గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. నకిలీ వీడియో చేయించిన రేవంత్, ఢిల్లీ పోలీసులు తన వెంటబడుతున్నారంటున్నాడని, తప్పుడు పనులు చేసే వారికి ఇదే గతి పడుతుందని అమిత్ షా వార్నింగ్ ఇచ్చారు.

ఏపీ డీజీపీపై ఈసీ వేటు

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిపై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ వేటువేసింది. డీజీపీని తక్షణమే బదిలీ చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీచేసింది. సోమవారం ఉదయం11 గంటల్లోగా ముగ్గురు డీజీ ర్యాంకు అధికారుల జాబితా పంపాలని ఆదేశించింది.

నిజామాబాద్ జిల్లా అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తాతో ఐఎంఏ బృందం.. చిత్రంలో పలువురు ప్రభుత్వ డాక్టర్లు

ప్రభుత్వ వైద్యుల కోడ్ ఉల్లంఘన!

బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేతో ప్రత్యేక భేటీ • మీట్ విత్ డాక్టర్స్ పేరుతో అర్వింద్ సమావేశం

నిజామాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా సర్కారు జీతం తీసుకుంటున్న కొందరు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఐఎంఏ సమావేశం ఇప్పుడు రాద్ధాంతానికి దారితీసింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ద్వారా మీట్ విత్ డాక్టర్స్ పేరుతో బీజేపీ ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రత్యేకంగా ఓ హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. మీడియాకు తెలియకుండా బీజేపీ ప్రజాప్రతినిధులు, ఐఎంఏ బాధ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు. తీరా ఫొటోలు బయటికి రావడంతో కొంత మంది ప్రభుత్వ వైద్యులు ఈ భేటీలో పాల్గొన్న విషయం వెలుగుచూడటంతో వివాదాస్పదంగా మారింది. సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలోనూ అర్వింద్‌తో మీట్ విత్ డాక్టర్స్... అంటూ ప్రదర్శించడం గమనార్హం. ఇందులో అనేకమంది ప్రైవేటు డాక్టర్లు ఉన్నప్పటికీ, దాదాపు ఐదుగురు ప్రభుత్వ వైద్యులు ఇందులో పాలుపంచుకోవడంపై చర్చ జరుగుతున్నది.

ఉద్యోగులు పాల్గొంటే కోడ్ ఉల్లంఘనే..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ నాయకులు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనవద్దని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఈసీ నిబంధనల మేరకు అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అలా పాల్గొంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకే ఓటు వేస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న గైరాన్‌తండా వాసులు

కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యం

- ఈసారి ఎట్టిపరిస్థితుల్లో మోసపోం
- మా మద్దతు బీఆర్‌ఎస్‌కే
- గైరాన్‌తండా వాసుల ప్రతిజ్ఞ

జడ్చర్లటౌన్, మే 5 : 'అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోయాం.. ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లో ఆ పార్టీకి ఓటెయ్యం.. బీఆర్‌ఎస్ పార్టీకే మా సంపూర్ణ మద్దతు' అంటూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గైరాన్ తండా వాసులు ప్రతిజ్ఞ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం జడ్చర్ల మండలంలోని గైరాన్‌తండా, మొరంబాయితండా, లక్ష్మణ్ నాయక్‌తండాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గైరాన్‌తండా వాసులు బీఆర్‌ఎస్ నాయకుల సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలోనే తండాలను జీపీలుగా ఏర్పాటు చేయడంతో ఎంతో అభివృద్ధి చెందినట్టు తెలిపారు.